www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 డిసెంబర్ 2025
5
పశ్చిమ గోదావరి



ఎరువుల దుకాణాలు తనిఖీ


తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి

ప్రజాశక్తి - కాళ్ల

మండల కేంద్రమైన కాళ్లలో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి పి.రమేష్ నాయుడు గురువారం తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లకు పలు సూచనలు జారీ చేశారు. లైసెన్స్‌లు తప్పకుండా షాపుల్లో ప్రదర్శించాలని, ఆధీకృత కంపెనీల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని తెలిపారు. బిల్లు బుక్‌లు, ఇన్‌వాయిస్‌లు, రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని సూచించారు. యూరియా విక్రయించేటప్పుడు అధిక యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను, నానో యూరియా ఉపయోగాలను రైతులకు తెలియజేయాలని సూచించారు.

జూద క్రీడలపై ఉక్కుపాదం

వరుస దాడులతో నిర్వాహకుల్లో వణుకు

డిఎస్‌పి పర్యవేక్షణలో ఐదుగురు కానిస్టేబుళ్లతో స్పెషల్ టీమ్


పోలీసులు దాడిలో పట్టుబడ్డ జూదరులు

ప్రజాశక్తి - నరసాపురం

కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న జూద క్రీడలపై నరసాపురం డిఎస్‌పి పర్యవేక్షణలో పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జీవితాలను అతలాకుతలం చేస్తున్న జూదం, కోడిపందేలకు సామాన్యులు ఆకర్షితులు కాకుండా వరుస దాడులు చేస్తున్నారు. పోలీసుల దాడులతో ఉలిక్కిపడిన వారు కొందరు గోదావరి, సముద్రం, ఆక్వా చెరువులు, గ్రామ శివార్లు ఎంచుకుని గుట్టుచప్పుడు కాకుండా జూద శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ తరహా దందాకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో అనుమానిత ప్రదేశాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో సబ్ డివిజన్‌వ్యాప్తంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో డ్రోన్లతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇలా గుర్తించిన స్థావరాలపై మెరుపు దాడులు చేస్తున్నారు.

ఐదుగురు కానిస్టేబుల్‌ల్లతో ప్రత్యేక టీమ్ ఏర్పాటు

నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో కొన్ని చోట్ల జూద క్రీడలు జరుగుతున్నట్లు సమాచారం ఉంది. జూదరులుకు అధికారులు, సిబ్బంది అండదండలు మెండుగా ఉండటంతో వారిని పట్టుకోవడం కష్టతరంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలపై డిఎస్‌పి ప్రత్యేక దృష్టి పెట్టి ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా, గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న జూద క్రీడలపై నరసాపురం సబ్ డివిజన్ పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. డిఎస్‌పి పర్యవేక్షణలో చేపడుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్లతో జూద నిర్వాహకుల్లో వణుకు మొదలైంది. కొద్దిరోజులుగా నరసాపురం పట్టణంతోపాటు మొగల్తూరు, నరసాపురం టౌన్, రూరల్, పాలకొల్లు టౌన్, పోడూరు, ఆచంట,


జూదంలో దొరికిన నగదు, కాయిన్స్, పేక కట్టలు

పెనుగొండ, పెనుమంట్ర మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లోని తోటలు, నిర్మానుష్య ప్రదేశాలు, కొన్ని గృహాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి, అనేక జూద స్థావరాల గుట్టురట్టు చేశారు. మొగల్తూరు స్టేషన్ పరిధిలో అత్యధిక పేకాట, కోడి పందేల శిబిరాలపై టీమ్ దాడులు చేసింది. పెనుగొండ, ఆచంట స్టేషన్ పరిధిలో గంజాయి సైతం పట్టుకుంది.


డిఎస్‌పి శ్రీవేద

మూడు నెలల్లో 26 దాడులు

సుమారు మూడు నెలల కాలంలో ఈ టీమ్ 26 దాడులు చేసి 26 కేసులు నమోదు చేసింది. 128 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.2,59,100 నగదు, 62 సెల్‌ఫోన్లు, 27 మోటార్ సైకిళ్లు, కోళ్లు ఏడు, 39 కోడి కత్తులు, 112 కాయిన్స్, సుమారు 10 కేజీల గంజాయి, 1353 పేక ముక్కలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా పండుగల సమయంలో లేదా వారాంతాల్లో ఊపందుకునే ఈ జూద క్రీడలను ప్రాథమిక దశలోనే అరికట్టడంలో పోలీసులు విజయం సాధించారు. ఎంతో పక్కాగా దాడులు చేస్తూ కేసులు నమోదు చేయిస్తున్న ఈ టీమ్‌పై ఉన్నతాధికారులకు గిట్టని కొందరూ తప్పుడు ఫిర్యాదులు చేసిన ఈ టీమ్ బెదరకపోగా మరిన్ని దాడులు చేస్తూ ముందుకు సాగుతోంది.

జూద క్రీడల సమాచారం అందించండి : డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద

జూదం అనేది అనేక కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేసే ఒక సామాజిక రుగ్మత. యువత చెడు మార్గంలో వెళ్లకుండా నిరోధించడం, శాంతిభద్రతలను కాపాడటమే నా ప్రధాన లక్ష్యం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఎవరైనా జూదం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే 112, 9440796615కు కాల్ చేసి సమాచారం అందించాలి. జూద క్రీడల సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

భీమవరం డిఎస్‌పిగా రఘువీర్ విష్ణు

జయసూర్యపై బదిలీ వేటు


రఘువీర్ విష్ణు

భీమవరం టౌన్: భీమవరం డిఎస్‌పి ఆర్.జయసూర్యపై బదిలీ వేటు పడింది. మంగళగిరిలోని హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని జయసూర్యను ఆదేశిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో విఆర్‌లో ఉన్న రఘువీర్ విష్ణును నూతన డిఎస్‌పిగా నియమించింది. పేకాట్ క్లబ్‌లకు అనుమతి, సెటిల్‌మెంట్ వ్యవహారాలపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కన్నెర్ర చేసి డిఎస్‌పిపై విచారణకు ఆదేశించిన సుమారు రెండు నెలల తర్వాత జయసూర్యపై బదిలీ వేటుపడింది.


ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న మంత్రి రామానాయుడు


వ్యవసాయ పనుల్లో మంత్రి రామానాయుడు


గట్టు లంకలు వేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు రైతుగా మారారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ, శాఖాపరమైన పనులు, పార్టీ బాధ్యతలతో బిజీగా ఉండే మంత్రి తీరిక లభించినప్పుడల్లా తనకు అత్యంత ఇష్టమైన వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్న సంగతి తెలిసిదే. క్రిస్మస్ సందర్భంగా కొంత తీరిక లభించడంతో తన స్వగ్రామం ఆగర్తిపాలెంలోని పొలానికి వెళ్లారు. ట్రాక్టర్‌తో దుక్కు దున్ని, గట్టు లంకలు వేస్తూ స్వయంగా వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ అయినా, మంత్రి అయినా కనీసం సీజన్‌లో ఒక గంటో, ఒక పూటో వ్యవసాయ పనులు చేస్తే రైతు కష్టం, వ్యవసాయం విలువ స్పష్టంగా తెలుస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

పేదల పొట్టకొట్టి.. బీడుగా భూములు..!



- నిరుపయోగంగా వట్లూరు భూములు
- పరిశ్రమా లేదు.. సాగుకు దూరంగా 350 ఎకరాలు
- రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా గెంటివేత
- గత జనవరి16న జరిగిన డిఆర్‌సి సమావేశంలో చర్చ
- ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడితే ఒట్టు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పరిశ్రమ కడతానన్నారు. వందల మందికి ఉపాధి దొరుకుతుందని నమ్మబలికారు. రైతులకు పరిహారం ఇస్తామని నమ్మించి పంటపొలాలు లాక్కున్నారు. తొమ్మిదేళ్లు గడిచినా పరిశ్రమ లేదు. రైతులకు చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా వందల ఎకరాల వట్లూరు పెద్ద చెరువు భూములను బీడుగా పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటూ పెద్దఎత్తున హడావుడి చేసింది. భూముల కోసం అన్వేషించి 2016లో పెదపాడు మండలం వట్లూరులోని భూములను ఎంపిక చేశారు. దశాబ్దాల తరబడి రైతుల సాగులో ఉన్న 350 ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా తీసుకుంది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. ఆ భూములు వట్లూరులోని పెదచెరువు భూములుగా రికార్డుల్లో ఉండటంతో రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో రైతులు తమ పోరాటం సాగించడంతో ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా నిర్ణయించారు. అప్పటి ఉండి ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు కుటుంబంలోని వారికి పరిశ్రమ ఏర్పాటుకు ఆ భూములను కట్టబెట్టారు. సిఎంగా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన సైతం చేశారు. అయితే టిడిపి హయాంలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చినా పరిశ్రమ ఏర్పాటు గురించిగాని, రైతులకు పరిహారం విషయంగాని పట్టించుకోలేదు. ఆ భూములపైనే ఆధారపడి బతికిన రైతులంతా రోడ్డునపడ్డారు. తొమ్మిదేళ్లుగా రైతులకు చిల్లిగవ్వ పరిహారం కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఎకరాకు 50 బస్తాల ధాన్యం పండే 350 ఎకరాల భూములు తొమ్మిదేళ్లుగా బీడుగా మారిపోయాయి. తమ భూములు తమకు ఇవ్వాలని, లేదా పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు సైతం బీడుగా ఉన్న వట్లూరు భూముల గురించి పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

డిఆర్‌సిలో చర్చ.. అయినా అడుగు ముందుకు పడితే ఒట్టు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2025 జనవరి 16 తేదీన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన డిఆర్‌సి సమావేశం జరిగింది. వట్లూరులో బీడుగా ఉన్న భూముల అంశాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ లేవనెత్తారు. ఆ భూముల వ్యవహారం కోర్టులో ఉందని, ఎపిఐసిసికి ప్రభుత్వం కేటాయించిందని అధికారులు సమాధానం ఇచ్చారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ జోక్యం చేసుకుని రైతులకు పరిహారం ఇవ్వలేదని, కోర్టు కేసులు పరిష్కరించి రైతులకు పరిహారం ఇచ్చి అక్కడ ఏదైనా పనులు మొదలు పెడితే బాగుంటుందని తెలిపారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. దాదాపు ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకూ వట్లూరు భూములపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మాది మంచి ప్రభుత్వం అంటూ చెప్పడం తప్ప.. ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా వట్లూరు భూసమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాల్సి ఉంది. రైతులకు తిరిగి భూములిచ్చేస్తే సాగులోకి వచ్చి, వేల బస్తాల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అలాకాకుండా బీడుగా పెట్టడం అత్యంత దారుణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

సిఐటియు మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెంటపాడు

విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నేతలు దూలం ప్రసాద్, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఈ మహాసభలో చర్చించి రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ఆందోళనా పోరాటాలకు రూపకల్పన చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జనవరి 4వ తేదీన విశాఖలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంటా కోటి, బర్ల బాలాజీ, పెనగంటి దుర్గా, దత్తు రాము, మద్దాల ఆనంద్, బుద్దాల సత్తిబాబు, కటారి చిట్టియ్య, పూడి బాలాజీ, మాదాసు రాజు, గాలి శివ, బేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజానేతలపై పీడీ యాక్టు సిగ్గుచేటు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

సిపిఎం అనకాపల్లి జిల్లా నేత అప్పలరాజును విడుదల చేయాలని నిరసనలు



ఉండిలో నినదిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, నేతలు

ప్రజాశక్తి - ఉండి

రైతు నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ యాక్ట్‌ను వెంటనే ఉపసంహరించుకుని, ఆయనను వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం ఉండి మెయిన్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న అప్పలరాజును అక్రమంగా, చట్ట విరుద్ధంగా నిర్బంధించి పీడీ యాక్ట్ పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. పేద రైతులు, అందులోనూ అసైన్డ్ భూములను సాగు చేస్తున్న దళిత, గిరిజన, బలహీన వర్గాల కోసం, వారి ప్రయోజనాలను కాపాడడానికే అప్పలరాజు ఉద్యమంలో పాల్గొని నాయకత్వం వహించారే తప్ప, ఆయన సొంత ప్రయోజనాల కోసం కాదని తెలిపారు. కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ పరిశ్రమ, పారిశ్రామిక కారిడార్ పేరిట రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మత్స్యకారులు, రైతులు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి అప్పలరాజు మద్దతుగా, అండగా ఉండటాన్ని ప్రభుత్వం సహించలేక నిరంకుశ చర్యలకు పాల్పడుతుందని గోపాలన్ మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం అప్పలరాజుపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలు, నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ధనికొండ శ్రీనివాస్, మండల కార్యదర్శి చీర్ల శేషగిరిరావు, నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, పెళ్లూరి సుబ్రహ్మణ్యం, నక్కా వెంకటేశ్వర్లు, మోపిదేవి రాము, నిమ్మితి కిషోర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలుపుతున్న నేతలు

భీమవరం : ప్రజా ఉద్యమ నాయకుడు, సిపిఎం అనకాపల్లి జిల్లా నేత అప్పలరాజుపై పీడీ యాక్టు మోపి జైలుకు పంపడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అప్పలరాజును విడుదల చేయాలని కోరుతూ గురువారం స్థానిక ప్రకాశం చౌక్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి దందాలు చేసే వాళ్లను వదిలి, ప్రజా ఉద్యమకారులను నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. అరాచక శక్తులపై ప్రయోగించాల్సిన పీడీ యాక్ట్‌ను ప్రజా ఉద్యమకారులపై ప్రయోగించడం దిక్కుమాలిన చర్యని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆందోళనలు చేసి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యలు చేపట్టడం రివాజుగా మారుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో అక్రమంగా భూసేకరణ చేపట్టి పేద రైతుల చేతుల్లోంచి భూములు లాక్కోవడం అన్యాయమంటూ అక్కడి రైతులకు అండగా ఉన్నందుకు పీడీ యాక్ట్‌ను ప్రయోగించడం దారుణమన్నారు. అధికారం ఉందిగా అని నిర్బంధాన్ని ప్రయోగించాలని చూస్తే గత చరిత్రను తిరగతోడినట్లవుతుందని హెచ్చరించారు. తక్షణమే పీడీ యాక్టు కేసు ఎత్తివేసి అప్పలరాజును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, జె.వెంకటలక్ష్మి, దొమ్మేటి మున్ని, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరంలో నేతల నిరసన

ఇరగవరం: ఉద్యమ నాయకుడు అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల కమిటీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం సిపిఎం ఆధ్వర్యాన అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ ఇరగవరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని, రైతుల భూములను బలవంతంగా తీసుకోబోమని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్దానాలన్నీ మరిచి రైతు భూములను బడా పెట్టుబడిదారులకు దారాదత్తం చేయడం కోసం బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం కోసం వందలాది భూములను బలవంతంగా లాక్కోవడాన్ని ప్రతిఘటిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా పీడీ యాక్టు పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమని అన్నారు. సమైక్యాంధ్ర పోరాటం నాటి నుండి ఇప్పటి వరకు ఆయనపై సుమారు 20 కేసులు రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని, వాటిని సాకుగా చూపి అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజల కోసం పనిచేసే అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జుత్తిగ రామాంజనేయులు, పిల్లి కోటేశ్వరరావు, జక్కంశెట్టి గంగాధర్‌రావు, గుబ్బల ముత్యాలరావు, ప్రజాసంఘాల నాయకులు పాలా సత్యనారాయణ, పిల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: రైతు ఉద్యమ నేత అప్పలరాజుపై పీడీ యాక్ట్ ప్రయోగించడం ఆటవిక చర్య అని సిపిఎం మండల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం వీరవాసరంలో మార్కెట్ సెంటర్లో నిరసన తెలిపారు. తక్షణమే అప్పలరాజును విడుదల చేయాలని, పీడీ యాక్టు రద్దు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ బొర్రా అలమహారాజు మాట్లాడుతూ అధికారం ఉందిగా అని ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తే ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందన్నారు. బాలం విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించకపోవడం వల్లనే ఉద్యమాలు పెరుగుతున్నాయన్నారు. అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, కొత్తల సత్తిబాబు, యండమూరి సుబ్బారావు, బొక్కా కూర్మారావు, శ్యాము, కరక వీరభద్రం, గోడు గాంధీ తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరంలో..



ఎఎంసి ఛైర్‌పర్సన్ సత్యవతి, వైస్ ఛైర్మన్ నాగ సుబ్బారావు

ఆచంట ఎఎంసి పాలకవర్గం నియామకం

ఛైర్‌పర్సన్‌గా కేతా సత్యవతి, వైస్ ఛైర్మన్‌గా ముచ్చర్ల నాగ సుబ్బారావు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని కూటమి ప్రభుత్వం ఖరారు చేసింది. ఛైర్‌పర్సన్‌గా ఆచంట పంచాయతీ పరిధిలోని కవురుపాలెం గ్రామానికి చెందిన కేతా సత్యవతి, వైస్ ఛైర్మన్‌గా ముచ్చర్ల నాగ సుబ్బారావు, డైరెక్టర్లుగా చింతపర్తి సావిత్రి, కోట బులి మారియా, నారెన సత్యవాణి, నల్ల నరసింహారావు, బొబ్బా కృష్ణవేణి, నక్కా మాధవి, చింతపల్లి రత్నకుమారి, బండి సత్యనారాయణ, మానుపాటి సత్తిబాబు, సంగినీడి జగదీష్, కమ్మ సత్యనారాయణ, బండి శ్యామ్‌ప్రసాదు, నామాల శ్రీనివాసు , మరో నలుగురు ప్రభుత్వ అధికారులు డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్ష పదవిని టిడిపి, ఉపాధ్యక్ష పదవి బిజెపికి కేటాయించారు. త్వరలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న ఉప సర్పంచి లక్ష్మీపతిరాజు

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెంలో అగ్నిప్రమాద బాధితునికి గ్రామ ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజు గురువారం తమవంతు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో శీలం సాల్మన్‌రాజు నివాసం ఉంటున్న ఇంటిలో అగ్నిప్రమాదం సంభవించి ఇల్లు కాలిపోయింది. అగ్నిప్రమాద బాధితుల ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పలకరించి ధైర్యం చెప్పి వారికి నిత్యావసర వస్తువులు, కొంత ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గాతల సందీప్, గోడి జాన్ పీటర్, కమతం అలంకారం, శీలం ఎలియా, గోడి సత్యానందం, గాతల చీటి యోహాన్ పాల్గొని వారికి సహాయం అందించారు.

డిప్యూటీ ఎంపిడిఒ చిన్నా ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు, నరసాపురం



నాగేశ్వరరావు(చిన్నా)(ఫైల్‌ఫొటో)

మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఒ ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా) గురువారం గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మొగల్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చిన్నా ఇటీవల డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 22 గ్రామ సచివాలయాలకు పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. నరసాపురంలోని మెడికల్ షాపునకు వెళ్లి మందులు తీసుకునే సమయంలో ఆకస్మికంగా కుంగిపోవడంతో అక్కడ నుండి సమీపంలోని ప్రయివేటు ఆసుపత్రికి స్థానికులు తరలించారు. అక్కడ వైద్యులు ఆయనను పరీక్షించి మృతి చెందినట్లు ధృవీకరించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి, తహశీల్దార్ కె.రాజకిషోర్, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచి బోణం నర్సింహారావు, వార్డు సభ్యులు, పంచాయతీ, సత్యవాలయ సిబ్బంది చిన్నా భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్‌ఎలు కొత్తపల్లి సుబ్బారాయుడు, ముదునూరి ప్రసాదరాజు, బండారు మాధవ నాయుడుతో పాటు ప్రస్తుత కూటమి ఎంఎల్‌ఎ నాయకర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం తెలిపారు.

బంగారయ్యకు మరో పురస్కారం

ప్రజాశక్తి - ఆకివీడు

వినియోగదారులకు ఉత్తమ సేవలందించినందుకు గాను వినియోగదారుల రాష్ట్ర సమాఖ్య సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్యకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవకుడి అవార్డు అందించింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రాజధాని విజయవాడలో బుధవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో బంగారయ్యకు వినియోగదారుల వ్యవహారాల శాఖ, పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ రాష్ట్ర ఎండి ఢిల్లీ రావు, డైరెక్టర్ గోవిందరావు ఈ అవార్డు అందజేశారు. ఈ మేరకు పూర్తి సమాచారాన్ని ఆయన గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. వినియోగదారుల సంఘాల సమన్వయకర్తగా, వృద్ధుల సంఘాల సమన్వయకర్తగా రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే 125 అవార్డులు పొందిన బంగారయ్య అవార్డుల అంబుల పొదిలో మరో అవార్డు చేరింది. ఈ అవార్డు పురస్కారం పొందిన బంగారయ్యను స్థానికులు అభినందించారు.



అబ్రహం, వనిమాస్ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నేతలు

టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్, కార్యదర్శిగా అబ్రహం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ప్రకటించిన జిల్లా కమిటీలో ఉండి మండలానికి తగిన ప్రాతినిధ్యం లభించిందని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఉండ్రు అబ్రహం, వనిమాస్ శ్రీనివాస్‌ను టిడిపి నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, దళిత నాయకులు ఉండ్రు అబ్రహంకు జిల్లా కార్యదర్శి పదవి దక్కడం అభినందనీయమన్నారు అలాగే మహాదేవపట్నంలో పార్టీకి అధిక మెజార్టీ రావడానికి కారణమైన సర్పంచి భర్త వనిమా శ్రీనివాస్‌కు జిల్లా అధికార ప్రతినిధి పదవి అప్పగించి న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, ప్రధాన కార్యదర్శి బండారు సుబ్బారావు, సీనియర్ నాయకులు ముదునూరి కృష్ణంరాజు, గంధం శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, నల్లా వల్లి సుబ్రహ్మణ్యం, నిచ్చెనకోళ్ల వీర్రాజు, పెద్దింటి బాబు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు

దేవస్థానం ఛైర్మన్ అడ్డాల శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల





దిగువ తిరుపతిగా పేరుగాంచిన కాళ్లకూరు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లూ చేశామని దేవస్థానం ఛైర్మన్ అడ్డాల శివరామరాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. 600 సంవత్సరాల చరిత్ర కలిగిన కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి తాను ఛైర్మన్‌గా పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. దేవస్థానం పూర్వ వైభవానికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు ప్రణాళిక, సూచనలు, సలహాల మేరకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఒకప్పుడు కాళ్లకూరు గ్రామస్తులే దేవస్థానం ధర్మకర్తల మండలి పాలకవర్గ సభ్యులుగా నియమితులయ్యేవారని తెలిపారు. ప్రస్తుతం కాళ్లకూరు గ్రామంతోపాటు జువ్వలపాలెం, బొండాడ, దొడ్డనపూడి గ్రామాల నుంచి ధర్మకర్తల మండలి పాలకవర్గ సభ్యులు నియమితులయ్యారన్నారు. రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం (పెద్ద తిరుపతి) తరువాత ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి), ఆ తరువాత కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి (దిగువ తిరుపతి) ఆలయాలుగా పేరుగాంచాయన్నారు. ఈ ఆలయం అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉండి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలల వచ్చే యాత్రికులకు సేవలందించాలనే ఉద్దేశంతో ఉన్నామన్నారు. టిడిపికి తాను చేసిన సేవలం గుర్తించి కాళ్లకూరు దేవస్థాన ఛైర్మన్ పదవి వరించిందన్నారు. గత 25 ఏళ్ల నుంచి అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక భావన పెంపొందించుకొని ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అన్నప్రసాదం వితరణ భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. దాత, ధర్మకర్తల మండలి పాలక వర్గ సభ్యులు నడింపల్లి వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో వంటశాల భవనం నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ భవనం పూర్తయిన తరువాత ప్రతి శనివారమూ అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దాతల సహకారంతో యాత్రికులకు మరిన్ని సేవలందిస్తానని, స్వామివారి దర్శనార్థం కాళ్లకూరు వచ్చేందుకు ఇటు భీమవరం - నుంచి అటు విజయవాడ నుంచి బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. ప్రతి నెలా ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, వైశాఖ మాసంలో ఆలయంలో స్వామివారికి కళ్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు చేశామన్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ముక్కోటికి నాటికీ స్వామి వారి క్యాలెండర్లు, లడ్డూలను సిద్ధం చేసి యాత్రికులకు విక్రయిస్తామన్నారు.

ఊరూవాడా క్రిస్మస్ వేడుకలు



ప్రాతళ్లమెరక సిబిసిఎన్‌సి చర్చిలో కొవ్వొత్తులతో విశ్వాసులు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలను రక్షించేందుకే ఆ దేవుడు ఏసు క్రీస్తుగా జన్మించాడని ఏలూరుపాడు ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం సంఘం కాపరి ఎండి ఇస్మాయేలు అన్నారు. మండల వ్యాప్తంగా క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్చిలను వివిధ రకాల విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచే విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం తెల్లవారుజాము నుంచి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ కుటుంబాలుఎంతో భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. మండలంలో ఉని ప్రధాన చర్చిలు క్రిస్మస్ వెలుగులను సంతరించుకున్నాయి. పండుగ సందర్భంగా వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు, బేకరీలు, హోటళ్లు తదితర వ్యాపార సంస్థలు కస్టమర్లకు ఆఫర్లు ప్రకటించాయి. ఈ సందర్భంగా చిన్నారులు భారీ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. లూథరన్, పెంతికోస్తు, సిఎస్ఐ, సిబిసిఎన్‌సి, ఆర్‌సిఎం, క్రీస్తు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో సంఘం సభ్యులు, సంఘస్తులు, స్త్రీల సమాజం సభ్యులు, యూత్ సభ్యులు, సండే స్కూల్ బాలలు పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్టు ఆధ్వర్యాన అన్నదానం

అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాళ్లకూరు గ్రామంలో సాగర్ల పేటలో ఉన్న షారోన్ చర్చ్ ప్రార్థన మందిరం వద్ద క్రిస్మస్ సందర్భంగా అన్న సమారాధన నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి 50 కేజీల చికెన్ పాస్టర్ సురేష్ బాబుకు ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ అన్న సమారాధనకు 700 లీటర్ల ఆర్‌ఒ వాటర్ అందజేశారు.

ఆచంట:ప్రేమ, కరుణ సందేశంతో ఏసు లోకానికి కొత్త మార్గాన్ని చూపారని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం క్రిస్మస్ వేడుకలు మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ప్రధాన కూడళ్ల, ప్రార్థనా మందిరాల వద్ద క్రిస్మస్ స్టార్, క్రిస్మస్ ట్రీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆచంట చిన్న పేటలో క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్‌ఎ పితాని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏసు ప్రభువలే ప్రతి ఒక్కరూ శాంతి, సహనంతో మెలగాలన్నారు. క్రిస్టమస్ కేక్ కట్‌చేశారు. అనంతరం సంఘం పెద్దలు ఎంఎల్‌ఎ పితానిని ఘనంగా సత్కరించారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి నాయకులు చిలుకూరి సీతారాం, బీర నరసింహమూర్తి, కేతా మీరయ్య, తమ్మినేడి పృథ్వీ కుమార్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మించిన రోజు క్రిస్మస్ అని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం నియోజకవర్గ ప్రజలకు గురువారం ఎంఎల్‌ఎ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. మానవాళిని సరైన మార్గంలో నడిపించడానికి ఏసుక్రీస్తు భూమిపై జన్మించారని భక్తుల నమ్మకమన్నారు.

భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డులోని బేతేలు చర్చి సిల్వర్ జూబ్లీ క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్‌ఎ అంజిబాబు పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ కృపావరం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోడూరు : జిన్నూరు పెద్దపేటలోని లూథరన్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా చిన్నారులు, యూత్ సభ్యులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోడూరులోని నూతన ఎరుషలేం ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఆచంట చిన్నపేటలో ఎంఎల్‌ఎను సన్మానిస్తున్న సంఘం పెద్దలు

తణుకు : ఏసుక్రీస్తు బోధనలు ఆదర్శనీయమని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని నియోజకవర్గంలోని తణుకు పట్టణంతోపాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని ఆయా చర్చిల్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఏకైక పండుగ క్రిస్మస్ అని సోదరులకు, పాస్టర్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చిల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్‌ఎ పాల్గొని కేకు కట్ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లోని షాపులు బొకేలు, కేకులు అమ్మకాలతో కళ కళ లాడాయి. చిన్న పిల్లలు గ్రీటింగ్ కార్డ్స్ స్నేహితులకు పంచి పెట్టారు.

ఉండి : మహదేవపట్నంలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి మానవుడు మానవత్వాన్ని అలవర్చుకుని సాటి మనిషికి సాయపడాలని ఆయన కోరారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు, వర్దనపు పౌల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం:పట్టణంలో క్రిస్మస్ వేడుకలు 'ఎ' క్లాస్ వెస్ట్ పారిష్‌లో నూతనంగా నిర్మించిన క్రిస్ట్ లూథరన్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన చర్చి భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కురియన్ జోసెఫ్, మోస్ట్ రెవ. డాక్టర్ కెఎఫ్.పరదేశిబాబు, మున్సిపల్ ఛైర్మన్ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ఆచంట:జనసేన ఆధ్వర్యంలో గురువారం వల్లూరు పంచాయతీ పరిధి వల్లూరుతోటలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. జనసేన ఆచంట వేమవరం గ్రామ ఉపాధ్యక్షులు దూది రాజు పుట్టినరోజు సందర్భంగా ఆయన పేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరు సొసైటీ అధ్యక్షులు తోట ఆదినారాయణ, జనసేన వల్లూరు అధ్యక్షులు కడిమి ఉమా మహేశ్వరస్వామి, తోట సాయిబాబు, కంచి ప్రసాద్, గూడవల్లి సురేష్, ఏడిద బాలు, బన్ను, తోట పనిద్ర, ఏడిద బాబులు పాల్గొన్నారు.

ముగిసిన సంసద్ ఖేల్ మహోత్సవ్ వేడుకలు

భీమవరం టౌన్:భీమవరం విష్ణు కాలేజీ ఆడిటోరియంలో గురువారం వాజ్‌పేయి జయంతి, సుపరిపాలన దినోత్సవం సందర్భంగా నరసాపురం పార్లమెంట్ పరిధిలోని సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో నరసాపురం పార్లమెంట్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఈనెల 23 నుండి జరిగిన ఈ క్రీడా సంబరాల్లో భాగంగా క్రీడాకారులకు చెస్, వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చి విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

నేడు టిడిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టిడిపి కార్యాలయంలో ఈ నెల 26న శుక్రవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్య క్రమం ఏర్పాటు చేశామని, నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

27న మంత్రి నిమ్మల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు

క్రిస్మస్ సందర్భంగా రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ధర్మారావు ఫౌండేషన్ నిర్వహిస్తున్న వార్షిక క్రిస్మస్ ఆరాధన మహోత్సవం ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు మంత్రి కార్యాలయం వద్ద ఘనంగా జరగనుంది. ప్రతి సంవత్సరమూ సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలకు పాలకొల్లు నియోజకవర్గంలోని ప్రతి గ్రామమూ, పట్టణంలోని ప్రతి వార్డు నుంచీ క్రైస్తవ సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరై పండుగ ఆనందాన్ని పంచుకోవాలని మంత్రి ఒక ప్రకటనలో కోరారు.

నేడు ఎంఎల్‌ఎ ఆధ్వర్యాన జనవాణి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నరసాపురం జనసేన కార్యాలయంలో శుక్రవారం 'జనవాణి-ప్రజా సమస్యల పరిస్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కళ్ల సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రవికిరణ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మానవ శరీరంలో కళ్లు అత్యంత సున్నితమైన అవయవాలని, వాటి సంరక్షణలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రవికిరణ్ సూచించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. కనుచూపు తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చిన్నపిల్లల్లో అధికంగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్స్ చూడటం వల్ల కంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిల్లలు, యువత రోజూ కొంత సమయం కళ్లకు విశ్రాంతి ఇవ్వడం, సహజ కాంతిలో పుస్తకాలు చదవడం వంటి అలవాట్లు పాటించాలని సూచించారు.

ప్రశ్న: కంటి వైద్య రంగంలోకి రావడానికి మిమ్మల్ని ప్రేరేపించిన ముఖ్యమైన అంశం ఏమిటి?

వైద్యులు: ఎంబిబిఎస్ తర్వాత చాలామంది రేడియాలజీ లేదా జనరల్ మెడిసిన్‌ను ఎంచుకుంటారు. అయితే కంటిచూపు సమస్య అనేది భారతదేశంలోనే ఎక్కువగా ఉంది. ఎంబిబిఎస్ చదువుతున్న రోజుల్లోనే కొంచెం టెక్నాలజీపరంగా ఆకర్షితుడిన య్యాను. అదేవిధంగా చిన్నప్పుడు పెద్ద ఆపరేష న్లు అంటే రక్తం అవి చూసి భయమేసేది. అందులోనూ టెక్నాలజీ పరంగా పేషెంట్ నొప్పి రాకుండా చేయవచ్చని ఈ రంగానికి వచ్చాను.



ప్రశ్న: సాధారణంగా ప్రజల్లో కనిపించే కంటి సమస్యలు ఏమిటీ?


వైద్యులు: జనరల్ ఓపిలో చూసినప్పుడు ఎక్కువగా శుక్లాల సమస్య ఉంటుంది. అదేవిధంగా చిన్న పిల్లల్లో ఎలర్జీ కంజెక్టు వైటీస్ అని కళ్లు నలుపుతూ ఉంటారు. ఈ సమస్య ఎక్కువగా చూస్తుంటాం.

ప్రశ్న: కంటి చూపు తగ్గడానికి ప్రధాన కారణాలు?

వైద్యులు: కంటి వక్రీభవన లోపం కారణంగా ప్రధానంగా కంటిచూపు తగ్గుతుంది. దీనివల్ల 50 నుంచి 60 శాతం చిన్న పిల్లల్లో కంటి చూపు తగ్గుతుంది. దాని తర్వాత ప్రధాన కారణం శుక్లాలు.

ప్రశ్న: కంటి ఆపరేషన్లు చేయించుకుంటే కళ్లకు సురక్షితమేనా, భవిష్యత్తులో ఏమైనా సమస్యలు వస్తాయా?

వైద్యులు: కంటి ఆపరేషన్లు చేయిం చుకుంటే చిన్న సమస్య ఉంటుంది. అయితే శుక్లాలు ఆపరేషన్ మాత్రం చాలా సురక్షితమైనది. వెయ్యి మందిలో ఒకరిద్దరు మాత్రమే ఇన్‌ఫెక్షన్‌తో బాధపడతారు.



ప్రశ్న: మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ స్క్రీన్లు చూడటం వల్ల వచ్చే సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

వైద్యులు: కోవిడ్ తర్వాత కాలంలో ఈ డిజిటల్ స్క్రీన్ చూడడం పిల్లల్లో ఎక్కువ పెరిగింది. దీనివల్ల పిల్లల్లో మయోపియా ఎక్కువగా వస్తుంది. అంటే దగ్గర చూపునకు అలవాటు పడటంతో దూరం చూపు కొంచెం తగ్గుతుంది. దీనినే మయోపియా అంటారు. దీన్ని నివారించడానికి పిల్లల్లో డిజిటల్ స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించాలి. అయితే టీచర్లు ఆన్‌లైన్ క్లాసులు, ఏదైనా నేర్చుకోవడానికి కూడా కాలేజీల వారు అవే డిజిటల్ క్లాసులు సూచిస్తున్నారు. కాబట్టి అవి తగ్గించలేం. అయితే టీవీలోగాని, ల్యాప్‌టాప్ వంటి పెద్ద స్క్రీన్‌లో చూడటం వల్ల కొంత ఉపయోగమే. పిల్లలను సూర్యరశ్మిలో కనీసం గంటసేపైనా ఆడుకోని వ్వాలి. కంటికి 'ఎ' విటమిన్ మంచిది కాబట్టి పిల్లలకు 'ఎ' విటమిన్ ఇచ్చే ఆకుకూరలు, పండ్లు వంటివి ఎక్కువగా పెట్టాలి.

ప్రశ్న: లేజర్ సర్జరీ అంటే ఏమిటి? ఆ సర్జరీ అందరికీ అవసరమా?

వైద్యులు: లేజర్ సర్జరీ అంటే కళ్లద్దాలు లేకుండా చేసే శస్త్ర చికిత్స. ఇది అందరికీ అవసరం లేదు. ఎక్కువ పవర్ ఉన్నవాళ్లకి దీని అవసరం ఉంటుంది. అయితే లేజర్ చికిత్స చాలా సురక్షితమైనది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ రావడం చాలా తక్కువ.

ప్రశ్న: చిన్నపిల్లల్లో అధికంగా కనిపించే కంటి సమస్యలు ఏమిటి?

వైద్యులు: చిన్నపిల్లల్లో అధికంగా కన్పించేది ఎలర్జీ కంజక్టివైటీస్. పిల్లలు బయట తిరుగుతూ ఆడుకుంటూ ఉంటారు. ఆ సమయంలో వాళ్ల కళ్లలో దుమ్ము, చెట్ల తాలూకా పిప్పడి పడే అవకా శం ఎక్కువగా ఉంటుంది. వాటి వల్ల ఎలర్జీ వచ్చే అవకాశం ఉంది. దానివల్ల కన్ను ఎక్కువగా నలుపుతూ ఉంటారు అలా నడపడం వల్ల నల్ల గుడ్డును బలహీనపడి కంటి చూపు తగ్గుతుంది.

ప్రశ్న: చిన్న పిల్లలు మొబైల్, టీవీలు చూడటం వల్ల వచ్చే కంటి సమస్యలు ఏమిటి?

వైద్యులు: చిన్న పిల్లలు ఎక్కువగా మొబైల్ చూడటం వల్ల ప్రధానంగా వచ్చేది మయోపియా. అదేపనిగా డిజిటల్ స్క్రీన్ చూడటం వల్ల కనురెప్ప మూసి, తెరిచేది తగ్గిపోతుంది. దానివల్ల రెప్ప వేయడం తగ్గిపోతుంది. దాని నుంచి కన్ను పొడబారిపోవడం, బ్లూ లైట్ కంటి మీద పడటం వల్ల కంటినరం దెబ్బతిని కంటి చూపు తగ్గుతుంది.

ప్రశ్న : వృద్ధాప్యంలో సాధారణంగా ఎదురయ్యే కంటి సమస్యలు?

వైద్యులు: వృద్ధాప్యంలో ప్రధానంగా చెప్పుకునే సమస్య కంటి శుక్లాలు. 50 నుంచి 60 సంవత్సరాలు దాటగానే అందరిలోనూ శుక్లాల ఛాయ మొదలవుతుంది. వారి వ్యక్తిగత అలవాట్లు, సూర్యరశ్మి తగలకపోవడం వల్ల శుక్లాల సమస్య ఎక్కువగా పెరుగుతుంది. లేదా నిదానంగానైనా పెరుగుతుంది. మరొకటి కంటి రెటీనాకు సంబంధించిన సమస్య. అందులో వయస్సుతోపాటు పసుపు రంగు పదార్థం వంటిది రెటీనా వద్ద పెరుగుతూ ఉంటుంది. అది పెరిగే క్రమంలో రక్తనాళాలు బలహీనపడి రక్తం కారడం వంటివి జరిగి చూపు తగ్గిపోయే సమస్య ఉంటుంది. అదేవిధంగా నీటి కాసులు, గ్లోకోమా వంటివి కూడా వచ్చే అవకాశం ఉంది.